## కథ

# అమ్మను కంటాను

''చెన్నూరి పార్వతీ''

''చెన్నూరి పార్వతీ''

''చెన్నూరి పార్వతి'' కోర్టు జవాను మూడో పిలుపు ముగించేసరికి కోర్టు హాలులోకి అడుగుపెట్టింది పార్వతి. జవాను బోనువైపు చూపించాడు. పార్వతి బోనులోకెళ్ళి నిలబడింది.

''ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ ఆక్ట్ కింద, భర్త బతికుండానే ఇంకో పురుషుడి ద్వారా బిడ్డను కనడానికి ప్రయత్నిస్తున్నావన్న నేరం నీమీద మోపబడింది. ఈనేరం నువ్వు చేశావా'' జడ్జిగారు తన సీటులోంచి కాస్త ముందుకు వంగి అడిగారు.

పార్వతి ఒక్కసారి తలపైకెత్తి కోర్టు హాల్లో ఉన్నవాళ్ళందరి వైపు చూసింది. అందరూ తననే చూస్తున్నారు. గుండుసూది నేలబడితే వినిపించేత నిశ్శబ్దం. పార్వతికి అప్పటివరకు జరిగిందంతా కళ్ళముందు కదిలింది.

ఆరోజు నగరంలోని లోకల్ ఎడిషన్లన్నీ 'అపూర్వ ప్రయోగం', 'అద్దెకో గర్భం', 'పిల్లల్లేని దంపతులకో శుభ వార్త' ఇలా రకరకాల శీర్షికలతో, ముందురోజు సమతా నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ లలిత కుమారి పత్రికా విలేఖరుల సమావేశంలో చెప్పిన విషయాలను ప్రచురించాయి.

''దంపతులిద్దరికీ పిల్లల్ని కనే శక్తి ఉండి కూడా ఏదో కారణం వలన గర్భం నిలవకుండా ఉన్నటువంటి పరిస్థితులలో, భార్యాభర్తల బీజకణాల్ని ప్రయోగశాలలో సంయోగపరిచి ఇంకో తల్లి గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఆమె ఆ బిడ్డని నవమాసాలు మోసి, ప్రసవం అయింతర్వాత తిరిగి అసలు తల్లిదండ్రులకు ఇచ్చేసే అపూర్వ ప్రయోగం అది. ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ హరిశ్చంద్ర ప్రసాద్, శారదాదేవి దంపతుల కోరిక ప్రకారం వాళ్ళ బిడ్డను పార్వతి అనే ఇంకో స్త్రీ కంటుందనీ, ఆమె ఇప్పుడు మూడోనెల గర్భవతి అనీ డాక్టర్ లలిత కుమారి తెలియచేశారు. ఈ పద్ధతి ద్వారా ఎవరైనా తన గర్భాశయాన్ని తొమ్మిది నెలలపాటు దానం చేసేందుకు ముందుకొస్తే పిల్లల్లేక బాధపడేవారికి, వారి అంశతో జన్మించే బిడ్డనే, ఇంకో స్త్రీ ద్వారా పొందే అవకాశం ఉందని ఆమె చెప్పారు. హరిశ్చంద్ర ప్రసాద్, శారదాదేవి తమ సంతోషాన్ని తెలియజేస్తూ, పార్వతి తమ ఇంట్లోనే పనిచేస్తోందని, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న ఆమె కుటుంబాన్ని ఆదుకునేందుగ్గాను, ఆమె చేసిన సహాయానికి ప్రతిఫలంగా తాము లక్షరూపాయలు ఇస్తామనీ చెప్పారు.

''పార్వతీ నీ ఫోటో కూడా వేశారే'' శారదాదేవి చేతిలో పేపర్ చూపిస్తూ, దూరంగా అవుట్ హవుస్ దగ్గర మొక్కలకు నీళ్ళు పోస్తున్న పార్వతిని పిలిచింది. పార్వతి ఒక్క పరుగున పోర్టికోలోకి చేరింది.

''ఆ..ఆ..అలా పరిగెట్టకు'' అంటూ పార్వతికి న్యూస్ పేపర్ అందించింది శారదాదేవి. పేపర్లో వేసిన తన ఫోటోని సంబరంగా చూసుకుంటూ ''అమ్మగారూ ఎంతయినా మీ బిడ్డకదండీ..'' అంది.

''అదేం కాదు పార్వతీ, నాలుగోనెల పూర్తయ్యేవరకూ నువ్వు ఎలాంటి పనులు చెయ్యకూడదని డాక్టరుగారు చెప్పలా?''

''అమ్మగారూ, అది సరేగానీ అటు చూడండి'' అంటూ గేట్వైపు చూపించింది.

అప్పుడే వచ్చి ఆగిన పోలీస్ జీప్‌లోంచి ఓ సబిన్స్పెక్టరు, ఇద్దరు కానిస్టేబుల్సు దిగి గేట్ తీసుకుని, పోర్టికో వైపు వస్తున్నారు. దగ్గరకొచ్చిన ఎస్సై ''నమస్కారమండీ'' అంటూ శారదాదేవికి నమస్కారం చేశాడు.

''నమస్కారం ఇన్స్పెక్టరుగారు, ఇలా వచ్చారేంటి'' అడిగింది.

''పార్వతి ఎవరండీ''

''ఈవిడే ఏం?''

''లక్షరూపాయలు తీసుకుని భర్త బతికుండగానే ఇంకొకరి ద్వారా గర్భవతి అయిందని తెలిసింది. అందుకు ఈమెను అరెస్ట్ చేస్తున్నాం. ఒక్కసారి అయ్యగారికి చెప్పి...'' ఆగాడు ఎస్సై.

''వారు ఇంట్లో లేరు. ఫ్యాక్టరీ కెళ్ళారు

''సరే మేడమ్, అయ్యగారొస్తే స్టేషన్‌కొకసారి ఫోన్ చెయ్యమన్చెప్పండి. ఈలోగా ఈ అమ్మాయిని స్టేషన్‌కి తీసుకెళ్ళి ఫార్మాలిటీస్ అన్నీ పూర్తిచేసి పంపించేస్తాం. రేపు కోర్టులో బెయిల్ తీసుకోవచ్చు'' అని చెప్పి పార్వతిని జీప్‌లో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

మర్నాడు కోర్టుకెళ్ళి పార్వతిని విడిపించుకొచ్చాడు హరిశ్చంద్ర ప్రసాద్. మూడునెలలు గడిచాక కేసు విచారణకొచ్చింది.

★★★

''ఏమ్మా, ఉలుకూ పలుకూ లేకుండా అలా నిలబడితే ఎలా? ఈ నేరం నువ్వు చేశావా లేదా?'' జడ్జిగారి మాటలకి ఉలిక్కిపడి పార్వతి ఈ లోకంలోకి వచ్చింది.

జడ్జిగారికి నమస్కరించి, ''అయ్యా నాకథ మీకందరికీ ఇంచుమించు పూర్తిగా తెలుసు. అయితే నేను ఏ పరిస్థితులలో ఈ పని చెయ్యాల్సివచ్చిందో చెప్తాను. విని, తర్వాత నేను చేసింది నేరమో కాదో నిర్ణయించండి. నా భర్త ఓ ప్రయివేటు కంపెనీలో డ్రయివరు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చి మంచాన బడ్డాడు. మందులకే నెలకు అయిదారు వందలు కావాలి. నాకిద్దరు పిల్లలు. వాళ్ళకు తిండి తిప్పలు, చదువులు, రోగాలు రొష్టులూ...అన్నింటికీ డబ్బు కావాలి. ఆపైన మాక్కావాల్సిన నిత్యావసర వస్తువులు. నా స్కూల్ ఫైనల్ చదువుతో ఏదైనా జాబ్ దొరుకుతుందేమోనని ప్రయత్నం చేశాను. ఎక్కడికెళ్ళినా ''బియ్యేలు, ఎమ్మేలకే పని దొరక్క ఏడుస్తుంటే నీకెవరిస్తారు'' అని ఎగతాళి చేసేవారు. కూలిపనికెళ్ళా. అలవాటు లేకపోవడం వల్ల ఒక్కరోజెల్తే వారం రోజులు మూలబడేదాన్ని. ఇక పచారీ లేక ఆ ఇంట్లో ఈ ఇంట్లో, ఈ పనీ ఆ పనీ చేసి నా భర్తకి పిల్లలకీ ఒక్కపూట తిండి మాత్రం పెట్టగలుగుతున్నాను. అలాంటప్పుడు శారదాదేవిగారు వారి బిడ్డను నేను తొమ్మిది నెలలు మోస్తే లక్ష రూపాయలిస్తామన్నారు. నా కుటుంబం ఆకలికి చావకుండా ఉండాలంటే, నా భర్తని కాపాడుకోవాలంటే ఏదో ఒకటి చెయ్యక తప్పదు, అని నిశ్చయించుకున్నాను. అందుకే నా గర్భాన్ని ఓ తొమ్మిది నెలలపాటు అద్దెకివ్వడానికి ఒప్పుకున్నాను. మనం ఇల్లు అద్దెకిచ్చుకుంటాం, కారు టాక్సీగా తిప్పుతాం, పొలం కౌలుకిస్తాం. అలాంటిది నా గర్భాశయాన్ని అద్దెకెందుకివ్వకూడదు? అది కూడా కేవలం ఓ తొమ్మిది నెలల టెంపరరీ ఉద్యోగం మాత్రమే అని ఎందుకనుకోరు. ఇందులో నేను చేసిన వ్యభిచారం ఏంటో మీరే ఆలోచించండి'' పార్వతి ఆవేశాన్ని అణుచుకుంటూ బోనులో నిలబడలేక కూలబడింది.

''విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నాను'' అని జడ్జి తన ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

శారదాదేవి ఒక్క పరుగున బోన్ దగ్గరకెళ్ళి, ''పార్వతీ, పార్వతీ'' అని పిలిచింది. పార్వతి కళ్ళు తెరిచి, మెల్లగా లేచి కోర్టు బయటకు నడిచింది. డ్రైవర్ కారు డోరు తీసి పట్టుకు

**శారదాదేవికి ఆశ్చర్యంతో నోట మాట రావటం లేదు. ''పిల్లల్లేక ఎన్నో ప్రయత్నాలు చేసి, చేసి చివరికి భగవంతుని దయ వల్ల, డాక్టరుగారి కృషివల్ల, పార్వతి ద్వారా తాను అమ్మను కాగలనని ఎంతో సంతోషపడింది. అలాంటిది తన భర్త...'' ఆపైన ఆలోచించలేకపోయింది. పార్వతి వైపు చూసింది.**

న్నాడు. పార్వతి శారదాదేవితోబాటు కారెక్కింది.

''పార్వతీ, భయపడకు. జడ్జిగారు నువ్వు చెప్పినంత సేపూ చాలా శ్రద్ధగా విన్నారు. తీర్పు మనకు అనుకూలంగానే వస్తుందనిపిస్తూంది'' శారద ధైర్యం చెప్పింది.


పార్వతి ఏమీ మాట్లాడలేదు. పొట్టమీద చెయ్యిపెట్టి నొక్కుకుంటూ ముందుకు వంగి కూర్చుంది.

శారదకు అనుమానం వేసి, ''ఏమయ్యింది పార్వతీ, ఏంటలా ఉన్నావు'' అనడిగింది.

''పొట్టలో నొప్పిగా ఉందమ్మగారూ'' మూలుగుతూ చెప్పింది.

''డ్రైవర్ డాక్టర్ దగ్గరికి పోనీ''

కారు వెనక్కి తిరిగి దగ్గరలోనే ఉన్న సమతా నర్సింగ్ హోమ్ ముందాగింది. డ్రైవర్ సహాయంతో పార్వతిని లోపలికి తీసుకెళ్ళి ఓ బెడ్‌మీద పడుకోబెట్టారు. డాక్టరు లలిత వచ్చి అన్ని పరీక్షలు చేసింది.



''ఏమయింది డాక్టరు గారూ?'' అడిగింది శారదాదేవి.

''బ్లీడింగ్ అవుతూంది, బి.పి కూడా ఎక్కువగా ఉంది. బాగా ఎక్సయిటయినట్టుగా ఉంది. ఇంజెక్షనిచ్చాను. నొప్పి తగ్గింతర్వాత, ఎందుకయినా మంచిది స్కానింగ్ చేద్దాం'' చెప్పింది డాక్టరు.

శారద లోపలికెళ్ళి భర్తకి ఫోన్ చేసి హాస్పిటల్‌కి రమ్మంది.

''నా అవసరం ఉందంటావా?'' అవతలివైపు నుండి భర్త గొంతు.

''అదికాదండీ, పార్వతి పొట్టలో నొప్పితో బాధపడుతూంది, డాక్టరుగారు స్కానింగ్ చెయ్యాలన్నారు. నాకు భయంగా ఉంది..''

''నువ్వున్నావుగా, ఇంకా నేనెందుకు?''

''ఏమండీ ప్లీజ్, మీరు కోర్టుగ్గూడా రాలేదు...''

''సర్సరే వస్తానులే''

కాసేపటికి హరిశ్చంద్ర ప్రసాద్ వచ్చాడు.

అక్కడి కుర్చీలో కూర్చుని ఉన్న పార్వతి లేచి నమస్కరించింది.

''పర్వాలేదు పడుకో పార్వతీ'' వారించింది శారదాదేవి.

''స్కానింగ్ ఎప్పుడు చేస్తారట'' అడిగాడు.

''ఇప్పుడే, నొప్పి తగ్గగానే చేస్తామన్నారు'' చెప్పింది.

ఇంతలో ఓ నర్స్ వచ్చి ''డాక్టరుగారు తీసుకురమ్మంటున్నారు'' అంటూ పార్వతిని లేపి మెల్లగా నడిపిస్తూ లోపలికి తీసుకెళ్ళింది.

హరిశ్చంద్ర ప్రసాద్ కూడా నర్సు వెంట లోపలికెళ్ళాడు.

బయట శారదాదేవి ఒక్కతే కూర్చుంది. కాసేపటికి భర్త వచ్చి పక్కనే కూర్చున్నాడు.

''డాక్టరుగారు ఏమన్నారండీ'' అడిగింది.

''ఏంలేదు'' ముభావంగా చెప్పాడు.

తర్వాత ఏం మాట్లాడాలో తెలియక శారదాదేవి కామ్‌గా కూర్చుంది.

ఓ పది నిమిషాలు భారంగా గడిచాయి.

''శారదా షి ఈజ్ ఆల్‌రైట్, బాగా ఎక్సయిటవడం వల్ల కొద్దిగా బ్లీడింగ్ కనపడింది, అంతే. మందులు రాసిస్తాను రెగ్యులర్‌గా వాడండి.'' డాక్టరు గారి గొంతు విని ఇద్దరూ ఈ లోకంలోకి వచ్చారు.

''చూడమ్మా పార్వతీ మనసులో ఎటువంటి దిగులూ పెట్టుకోకుండా ప్రశాంతంగా ఉండు'' అని అప్పుడే అక్కడికొచ్చిన పార్వతితో చెప్పి, ''హరిశ్చంద్ర ప్రసాద్‌గారూ, పార్వతి కడుపులో పెరుగుతున్న మీ 'అమ్మాయి'కేం ఢోకాలేదు. మీ సందేహం తీరిందనుకుంటాను..శారదా నథింగ్ టు వర్రీ, బీ హాపీ'' అంటూ ఒకేసారి ముగ్గుర్నీ పలకరించి ''ఇక వెళ్ళిరండి'' అంటూ తన కన్సల్టింగ్ రూమ్‌లోకెళ్ళింది డాక్టరు లలిత.

అప్పటివరకూ శారదాదేవిని పీడిస్తున్న అనుమానానికి సమాధానం దొరికినట్టయింది. ''ఈయన ఒంటరిగా లోపలికెళ్ళి పార్వతి కడుపులో పెరుగుతున్నది మగబిడ్డో, ఆడపిల్లో చెప్పమని డాక్టరుగారిని అడిగారన్నమాట. ఆడపిల్లని డాక్టరుగారు చెప్పగానే, ఈయన ముఖంలో కాంతి తగ్గిపోయిందన్నమాట...''

''శారద పద'' భర్త పిలుపుతో శారదాదేవి ఆలోచన్లకి బ్రేక్ పడింది. ముగ్గురూ వెళ్ళి కారెక్కారు. కారు ఇంటి ముందాగగానే హరిశ్చంద్ర ప్రసాద్ దిగి విసవిసా నడుచుకుంటూ లోపలికెళ్ళిపోయాడు. పార్వతి మెల్లగా కారు దిగి ''ఇక మా ఇంటికెళ్తానమ్మగారు'' అంది.

''ఈరోజుకి వద్దులే పార్వతీ, మళ్ళీ ఏ అర్ధరాత్రో, ఇంకేదైనా ప్రాబ్లం వస్తే కష్టం. ఈ పూటకిక్కడే పడుకో. ఇంటికి కబురెడ్తాలే'' అనునయించింది శారదాదేవి.

''వద్దమ్మగారూ, నొప్పి తగ్గిపోయింది. ఫర్వాలేదు ఇంటికెళ్తా''

''సరే నీ ఇష్టం, డ్రైవర్ పార్వతిని ఇంటి దగ్గర దింపిరా''

''శారదా, ఒక్క సెకండ్ పార్వతిని ఉండమను'' అన్న హరిశ్చంద్ర ప్రసాద్ కేకతో ఆగి నిలబడ్డారు. హరిశ్చంద్ర ప్రసాద్ పోర్టికోలోకి వచ్చి నిలబడ్డాడు.


''చూడు పార్వతీ, మాకు భగవంతుని దయవల్ల రెండు

దువ్వూరి రాజారెడ్డి

మూడు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి పాస్తులున్నాయి. గ్రహచారం బాగులేక మాకు పిల్లలు కలగలేదు. అందుకే నీకు లక్షరూపాయలు ఇచ్చి మా కోసం ఓ బిడ్డను కనమన్నాం. అయితే నా వంశాన్ని నిలబెట్టే వారసుడు నాకు కావాలిగానీ, ఇంకో ఇంటికి వెళ్ళిపోయే ఆడపిల్ల నాకనవసరం...

''ఏమండీ..'' శారదాదేవి మధ్యలో అడ్డుపడింది.

''శారదా నన్ను పూర్తిగా చెప్పనీ...అందువల్ల నువ్వు ఓ పన్నెయ్యి..అబార్షన్ చెయ్యించుకో..నువ్వలా భయపడాల్సిన పన్లేదు. అబార్షన్ ఊరికే చెయ్యించుకోనవసరం లేదు. నీకు యాభైవేలిస్తాను. తర్వాత మళ్ళీ మన డాక్టరుగారికి చెప్పి ఇంకోసారి ప్రయత్నం చేద్దాం. ఈసారి నీ గర్భంలో మగబిడ్డ పడితే, దానికి మన ముందు అగ్రిమెంటు ప్రకారం లక్ష రూపాయలు మళ్ళీ ఇస్తాను'' ఎంత స్పీడ్‌గా చెప్పాడో అంత స్పీడ్‌గా లోపలికెళ్ళిపోయాడు.



శారదాదేవికి ఆశ్చర్యంతో నోట మాట రావటం లేదు.

''పిల్లల్లేక ఎన్నో ప్రయత్నాలు చేసి, చేసి చివరికి భగవంతుని దయవల్ల, డాక్టరుగారి కృషివల్ల, పార్వతి ద్వారా తాను అమ్మను కాగలనని ఎంతో సంతోషపడింది. అలాంటిది తన భర్త...'' ఆపైన ఆలోచించలేకపోయింది.

పార్వతి వైపు చూసింది.

వరండాలోని స్తంభం కానుకుని నిలబడి ఉంది.

ముఖంలో ఏ భావమూ లేదు. ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నట్టుంది.

''పార్వతీ...నేనాయనికి నచ్చచెప్తాను..'' నీరసంగా పలికింది శారదాదేవి.

''వద్దమ్మగారూ...నా కడుపులో పెరుగుతున్న బిడ్డ నా అంశతో పుట్టకపోవచ్చు. కానీ నా రక్తమాంసాలతో పెరుగుతోంది కాబట్టి అది నా బిడ్డే. మీ ఇల్లు నిలబెట్టుకోడానికి, నా పేదరికాన్ని కూలదొయ్యడానికి ఆరోజు నా మనసొప్పుకోకపోయినా, నా గర్భాన్ని అద్దెకివ్వడానికి ఒప్పుకున్నాను. ప్రాణం పొయ్యడానికి ఆరోజు అయ్యగారు లక్ష రూపాయలిస్తామన్నారు. ఈరోజు ప్రాణం తియ్యడానికి అందులో సగం ఇస్తామంటున్నారు. వద్దమ్మా...వద్దు. మీ డబ్బు నాకొద్దు. డబ్బు కోసం కడుపులో పెరుగుతున్న ఓ నిండు ప్రాణాన్ని తియ్యలేను..వెళ్ళొస్తానమ్మగారూ'' అంటూ లేచి నిలబడింది పార్వతి.

నీరసంగా, తూలుతూ బయటకు నడిచింది.

''పార్వతీ..ఆగు, పార్వతీ..'' శారదాదేవి పిలుస్తూ ఉంది.

పార్వతికి అవేవీ వినిపించలేదు. అలాగే ఇల్లు చేరి బట్టలు కూడా మార్చుకోకుండా మంచం మీద వాలిపోయింది. మగతగా అనిపించింది, కళ్ళు మూతలు పడుతున్నాయి. అలాగే నిద్రలోకి జారుకుంది పార్వతి.

''మ్..మ్మ్..మ్మా'' ఎవరో పిలిచినట్టనిపించింది పార్వతికి.

''ఎవరూ'' గట్టిగా అరిచాననుకుంది. కానీ శబ్దం గొంతుదాటి బయటకు రాలేదు.

''నేనే మ్మా'' అదే గొంతు ముద్దుగా, మృదువుగా!!

''ఎవరమ్మా నువ్వు'' అడిగింది పార్వతి.

''నేనే అమ్మా..నీ పాపని'' కడుపులో నుండి పిలుస్తున్నట్టనిపించింది.

''అమ్మా...నన్ను చంపేస్తావా...'' మళ్ళీ అదే గొంతు.

''నాకు నిన్ను చూడాలనుంది, ఈ లోకాన్ని చూడాలనుంది. ఎత్తైన కొండల్ని, పచ్చటి లోయల్ని, రంగురంగుల పువ్వుల్ని, రకరకాల జంతువుల్ని, అనంతమైన సముద్రాన్ని, వినీల ఆకాశాన్ని, ఇంకా ఇంకా..నువ్వు చూసే ప్రతి వస్తువునీ చూడాలనుంది. చూపించవూ...''

''చూపిస్తానమ్మా, తప్పకుండా చూపిస్తాను'' ఈసారి నిజంగానే గట్టిగా అరిచింది. మగత ఎగిరిపోయింది. కల కరిగిపోయి ఈ లోకంలోకి వచ్చింది పార్వతి.

ఇంతవరకు తను విన్నది నిజం కాదా!

ఆ గొంతు తన పాపది కాదా!!

అంతా తన భ్రమా!!!

హు...పోనీ, నా పాప పెరిగి ఓ ఇందిరాగాంధీయో, ఓ మదర్ థెరిస్సానో కాకూడదా? ఎందుకు కాదు. ఒకవేళ కాకపోయినా ఓ చక్కని కూతురు కాగలదు. ఓ మంచి అమ్మ కాగలదు.

అమ్మ లేకపోతే మహాత్మాగాంధీ ఉండేవాడా?

అమ్మ లేకపోతే...ఛత్రపతి శివాజీ, అబ్రహాం లింకన్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్...వీళ్ళందరూ పుట్టేవాళ్ళా?

అందుకే నేను ఓ మంచి అమ్మను కంటాను.

''అవును అమ్మని కంటాను'' దృఢంగా అనుకుంది పార్వతి.

★


## బ్రిటన్ వాణిజ్య కేంద్రం మాంచెస్టర్

బ్రిటన్‌లో ఉత్తర ప్రాంత వాణిజ్య నగరం మాంచెస్టర్‌లో ఆధునిక వాణిజ్య ప్రగతి అంతా కనిపిస్తుంది. నగరంలో వేగవంతమైన నైపుణ్యాంగల రవాణా వ్యవస్థ వుంది. యుకెలోని అనేక చారిత్రాత్మక ప్రాధాన్యతగల ప్రాంతాలకు మాంచెస్టర్ నుంచి సునాయాసంగా చేరుకోవచ్చు.

గత శతాబ్దంలోని పారిశ్రామిక విప్లవం తరువాత మాంచెస్టర్ ఓ సుప్రసిద్ధ వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. టూరిజం ప్రాధాన్యత విస్తరించాక అనేక విక్టోరియన్ గిడ్డంగులు లగ్జరీ హోటళ్ళుగానూ, ఆకర్షణీయమైన బార్‌లుగా రూపాంతరం చెందాయి.

### గ్రానడా స్టూడియోలు:

నగరంలోని విస్తృత ఆకర్షణ గ్రానడా స్టూడియోలు. అందులో పూర్తి ఆధునికమైన టెలివిజన్ స్టూడియో వుంది. ఆ స్టూడియో దర్శించిన సందర్శకులకు కెమెరాల వెనుక వున్న జీవన వైవిధ్యం బోధపడుతుంది. గ్రేటర్ మాంచెస్టర్ వారసత్వ సంపద కూడా అవగతమవుతుంది. ప్రపంచంలోని మొట్టమొదటి పాసింజర్ రైల్వేస్టేషన్ ఈ నగరంలోని 'మ్యూజియం ఆఫ్ సైన్సెస్ అండ్ ఇండస్ట్రీ' ప్రాంతానికి చేరువలో నిర్మించబడి వుంది.



మాంచెస్టర్‌లోని ఆర్న్‌డేల్ సెంటర్ ఆధునిక షాపింగ్ ప్రక్రియకి అనువుగా వుంటుంది. ఈ కాంప్లెక్స్‌లో యూరప్‌లోని అతి పెద్ద సెలక్షన్ షాపులు, కేఫ్‌లు, మార్కెట్‌లు, స్పెషాలిటీ మరియు డిజైనర్ స్టోర్‌లు ఉన్నాయి. థియేటర్ ఆకర్షణల విషయం పరిశీలిస్తే పశ్చిమ యూరప్ తరువాత ఇక్కడే సంగీత విభావరులు, క్లాసికల్ డ్రామాలు, రివ్యూలు, బాలేలు, ఒపెరాలు ప్రతి ఒక్కరి పర్సుకు అందుబాటులో వుంటాయి. న్యూ మాంచెస్టర్ ఎరినాలో సంగీత విభావరులు, క్రీడా ప్రదర్శనలు జరుగుతుంటాయి.

### ఆర్ట్ గ్యాలరీ

మాంచెస్టర్ ఆర్ట్ గ్యాలరీలో ఓల్డ్ మాస్టర్స్‌కు పెద్ద పీట వేయడం కనిపిస్తుంది. గెయిన్స్‌బరో, స్టబ్స్ వంటివారి పెయింటింగ్‌లు భద్రపరచబడ్డాయి. బరీస్ ఆర్ట్ గ్యాలరీలో నీటి రంగులు, నూనె రంగుల చిత్రాలు కానిస్టేబుల్ టర్నర్‌లు వేసినవి ఉన్నాయి.

కళా విమర్శకులను మాంచెస్టర్ ఉచితరీతిలో ఆకట్టుకుంటుంది. చక్కని రెస్టారెంట్లు, బిస్త్రోలు, వైన్ బార్‌లు, సాంప్రదాయ విశ్రాంతి గృహాలు, దాదాపు 30 దేశాలకు చెందిన వివిధ ఖాద్య పదార్థాలను, భోజనాన్ని అందిస్తాయి. మాంచెస్టర్‌లోని చైనా టౌన్‌లో కూడా చక్కని రెస్టారెంట్లు, షాపులు సందర్శకులను అలరించడానికి సిద్ధంగా ఉంటాయి.

**-గోపాలుని రఘుపతిరావు**